నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 10 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


గడ్డెన్న వాగు ప్రాజెక్టు కింద పుస్నూర్‌లో నీరందక ఎండిపోయిన వరిపంట

- గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- ప్రధాన కాలువకు కేవలం 80 క్యూసెక్కుల నీటి విడుదల
- తూముల కంటే దిగువన నీటి ప్రవాహం
- మోటార్లు పెట్టుకున్నా అందని తడవని మడి
- అయోమయంలో అన్నదాతలు.. నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్

# తడికి తండ్లాట

## ఎండుతున్న పంటలు.. చి'వరి'కి అందని నీరు

కాంగ్రెస్ తెచ్చిన కరువు

### మళ్లీ పాత కాలం రోజులు అచ్చినయ్...



గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువను నమ్ముకుని వరి వేస్తే రెండెకరాలు ఎండింది. నోటికి అచ్చిన పంట కండ్ల ముందే ఎండిపోతున్నది. నీళ్లు లేక రెండెకరాలు ఇడిసిపెట్టి, పొట్ట కోసం ఒక ఎకరం పొలాన్ని అయినా కాపాడుకుందామని నానా తంటాలు పడుతున్న. ఎకరానికి రూ.5 వేలు కిరాయి ఇచ్చి మోటరు తెచ్చుకుని నీళ్లు పారించుకుంటున్న. రోజుకు పది సార్లు కరెంటు బంద్ అయితున్నది. అర్ధరాత్రి ఒంటి గంటకు కరెంటు ఇస్తున్నరు. మళ్లీ పాతకాలం లెక్క రోజులు అచ్చినయ్. నీళ్ల కోసం పొలం కాడనే పడుకుంటున్న. నాకు పుస్పూర్ శివారంల ఉన్న మూడెకరాల పొలంల వరి వేసిన. కెనాల్ కింద నీళ్లు అందకుంటే కాల్వ పొంట మోటర్లు పెట్టుకుని నీళ్లు పారించుకొమ్మని ఆఫీసర్లు చెప్పిన్రు. ఇప్పుడేమో నీళ్లు లేవని మోటర్లు పెట్టనిస్తలేరు. రాత్రి పూట అచ్చి బంద్ చేస్తున్నరు. కెనాల్ పొంటనే భూమి ఉన్నప్పటికీ నీళ్లు అందుతలేవు. కాలువల నీళ్లు జానెడు మట్టం కూడా అస్తలేవు. తూములు మీదికైనయ్. నీళ్లు కిందికి అయినయ్. కేసీఆర్ ఉన్నప్పుడు కాలువ పుల్లు పారుతుండే. పొలాలు పారంగా ఇంకా మిగిలిన నీళ్లతో చెరువుల నిండుతుండే. తూముల నుంచే పొలాలు పారుతుండే. ఇప్పుడు మోటర్లు పెట్టినా అందుతలేవు. ఈ గవర్నమెంట్ అచ్చిన సంది రైతులకు చాన తిప్పలైతున్నది. రుణమాఫీ బరాబర్ కాలే. రైతుబంధు రాలే. రైతుల బతుకు తువ్వాల అడ్డం పెట్టుకుని ఏడుసుడుకు అచ్చింది. ఇంత అందేర్ అయితదని అనుకోలే.

*- పర్స పోతన్న, రైతు, పుస్పూర్, లోకేశ్వరం మండలం.*

నిర్మల్, మార్చి 9(నమస్తే తెలంగాణ) : గడ్డెన్న వాగు ప్రాజెక్టు కింద యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారింది. పాలకుల పట్టింపు లేనితనం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందడం లేదు. భైంసా పట్టణ శివారులో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా భైంసా, లోకేశ్వరం మండలాల్లోని దాదాపు 14 వేల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉన్నది. 2005 సంవత్సరంలోనే ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినప్పటికీ, కాలువల నిర్మాణం జరగకపోవడంతో ఆయా మండలాల్లోని భూములు ఏళ్లుగా సాగు నీటికి నోచుకోలేదు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2017లో ఈ ప్రాజెక్టు కింద ప్రధాన కాలువ నిర్మాణానికి అప్పటి సీఎం కేసీఆర్ రూ.6 కోట్లు విడుదల చేశారు. దీంతో దాదాపు 20 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం భైంసా నుంచి పుస్పూర్, బిలోలి గ్రామాల వరకు కాలువ ద్వారా సాగు నీరు అందుతున్నది. మరో 8 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందు కోసం గతేడాది కాలంగా నిధులు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది. దీంతో ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందడం లేదు.

### కేవలం 80 క్యూసెక్కులే..

గడ్డెన్న వాగు ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా రోజుకు కేవలం 80 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తుండడంతో కాలువ కింద సాగు చేస్తున్న పంటలకు నీరు సరిపోవడం లేదు. వాస్తవానికి ఈ కాలువ ద్వారా 14 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, ప్రస్తుతం ఎనిమిది వేల ఎకరాలకు కూడా సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన చాలామంది రైతులు ఈ కాలువ నీటినే నమ్ముకుని యాసంగిలో వరి, మక్క సాగు చేశారు. అయితే అతి తక్కువ నీటిని వదులుతుండడంతో కనీసం తూముల మట్టం కూడా నీరు ప్రవహించడం లేదు. దీంతో ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు ఎన్నో వ్యయ ప్రయాసాలకోర్చి మోటార్లను ఏర్పాటు చేసుకుని కాలువలో ఉన్న అరకొర నీటిని తోడుకునే ప్రయత్నం చేస్తున్నారు. దీనికి కూడా అధికారులు అడ్డంకులు సృష్టిస్తుండడంతో పంటలు ఎండిపోతున్నాయి. రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్లను నీటిపారుదల శాఖ సిబ్బంది తొలగిస్తున్నారు. అంతే కాకుండా విద్యుత్ వైర్లను కట్ చేసి తమను ఇబ్బందుల పాలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి రైతుభరోసా సాయం అందకున్నా.. అప్పులు చేసి సాగు చేసిన పంటలు తమ కళ్ల ముందే ఎండుతుంటే రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఒకవైపు కరెంటు కోతలు, మరోవైపు సాగునీటి తిప్పలతో మళ్లీ ఉమ్మడి రాష్ట్ర పాలన రోజులు గుర్తుకు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. గత 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో ఇలాంటి కష్టాలు ఎన్నడూ చూడలేదని, ఈ కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయని పుస్పూర్‌కు చెందిన రైతులు పర్స పోతన్న, భూషన్‌రెడ్డిలు 'నమస్తే' ప్రతినిధితో వాపోయారు. ఒక చేతిలో కట్టె, మరో చేతిలో టార్చి లైట్ పట్టుకుని అర్ధరాత్రి తమ పొలాలకు నీళ్లు పారియతందుకు వెళ్తున్నామని, ఈ కష్టం పగోడికి కూడా రావొద్దని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


లోకేశ్వరం మండలం పుస్పూర్‌లో ఎండిపోయిన మక్కపంటను చూపుతున్న రైతు భూషన్‌రెడ్డి

### కాలువల నీళ్లే లేవు..

గడ్డెన్నవాగు ప్రాజెక్టు కింద మెయిన్ కెనాల్‌కు సరిగ్గా నీళ్లిస్తలేరు. ఉన్న కొన్ని నీళ్లను మోటార్లు పెట్టి పంటలను కాపాడుకుందామంటే అధికారులు సహకరిస్తలేరు. కాలువ మీద పని చేసెటోళ్లు అచ్చి మోటర్లు బంద్ చేస్తున్నరు. కరెంటు వైర్లు కట్ చేస్తున్నరు. కరెంటు కూడా సక్కగ ఉంటలేదు. ఎప్పుడు అస్తదో ఎప్పుడు పోతదో తెలుస్తలేదు. వరి, మక్క పంటలు ఎండిపోతున్నయ్. కాలువ పక్కనే నాకు భూమి ఉన్నది. మా కోసమే తూము ఉన్నప్పటికీ.. తూము లెవల్ కూడా నీళ్లు వదలడం లేదు. మోటర్లు పెట్టి పారిద్దమంటే కాలువల కనీస మట్టం కూడా నీళ్లుంటలేవు. కాలువ మీదనే ఆధారపడి పంటలు ఏసినం. కేసీఆర్ హయాంలనే కాలువలు తవ్విం్రడు. నాలుగేండ్ల సంది ఏ ఇబ్బంది లేకుండె. ఈ సంవత్సరమే నీళ్లు లేక పంటలన్నీ ఎండిపోతున్నయ్. రెండెకరాల్లో వరి, రెండెకరాల్లో మక్క పంట వేసిన. వరి మొత్తం ఎండింది. ఎకరానికి 20 వేల చొప్పున పెట్టుబడి ఖర్చులైనయ్. రెండెకరాలకు 40 వేల పెట్టుబడి ఖర్చులు నష్టపోయిన. రైతులకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి సాయం చేయడం లేదు. కనీసం ఎండిన పంటలను సర్వే చేసి నష్టపోయిన రైతులకు పరిహారాన్ని ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

*- కోనాజి భూషన్‌రెడ్డి, రైతు, పుస్పూర్, లోకేశ్వరం మండలం*


కాలువలో తూముకు దిగువన తక్కువ మట్టంతో పారుతున్న నీరు

# పక్కనే ప్రాణహిత.. కానరాని నీటి చుక్క

## జీవనది సమీపంలోనే ఉన్నా రైతన్నకు తప్పని తిప్పలు

- 300-400 ఫీట్ల వరకు బోర్లు వేసినా నీరు పడని వైనం
- పొలాల్లో విద్యుత్ లేన్‌లున్నా వినియోగించుకోలేని దుస్థితి
- అరిగోసపడుతున్న బెజ్జూర్ రైతులు


ఈ చిత్రంలో బోరులోకి ఆశగా చూస్తున్న రైతు పేరు నాగుల రవి. ఈయనది బెజ్జూరు గ్రామం. తనకున్న మూడెకరాల కోసం బోరు వేసుకోవాలనుకున్నడు. రంది లేకుండా వర్షాకాలం, యాసంగిలో పంటలు వేసుకోవాలనుకున్నడు. రూ. 3 లక్షల దాకా ఖర్చు చేసి.. మూడు బోర్లు వేశాడు. ఒక్కొక్కటి 300 ఫీట్ల లోతు వరకు వేసినా చుక్కనీరు పడలేదు.

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/బెజ్జూర్, మార్చి 9 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్ మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలోనున్న జీవనది ప్రాణహిత ఏడాదంతా ప్రవహిస్తూనే ఉం టుంది. పక్కనే ప్రాణహిత ఉన్నా పొలాలకు మాత్రం నీటి చుక్క అందడం లేదు. బెజ్జూర్ మండలంలో దాదా పు 30 మంది రైతులు 100కు పైగా బోర్లు వేశారు. 300-400 అడుగుల లోతుకు వేసినప్పటికీ ఒక్క బోరులో కూడా నీటి చుక్క కనిపించడం లేదు. తమ ప్రాంతంలో సారవంతమైన భూములున్నప్పటికీ భూగర్భ జలాలు అడుగంటి కేవలం వర్షాధార పంటలకు మాత్రమే పరిమితం అవుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో గొల్లబాయి చెరువు, స్ప్రింగానికల్ మత్తడి ఉన్నప్ప టికీ వీటి ద్వారా కూడా వర్షాకాలంలో తప్పా మిగతా కాలంలో నీరు అందడం లేదు.

నిరుపయోగంగా కాంట్రంగి భీమయ్య వేసిన బోరు



### రూ. 2 లక్షలు ఖర్చుచేసి మూడు బోర్లు వేసిన



నాకు ఎల్కపల్లి శివారులో రెండున్నర ఎకరాలు ఉంది. ఈ ఏడాది మూడు బోర్లు వేసిన. ఒక్కదాంట్లో కూడా నీళ్లు పడ్డది లేదు. ఒక్కో బోరును దాదాపు 300 ఫీట్ల నుంచి 350 ఫీట్ల వరకు వేయించిన. అయినా నీళ్లు పడలేదు. బోర్లు వేయడానికే దాదాపు రూ. 2 లక్షల వరకు ఖర్చు చేసిన. నాకు తెలిసి చుట్టుపక్కల ఉన్న 30 మంది రైతులు బోర్లు వేసిన్రు. ఒక్కరికీ నీళ్లు పడలేదు.

*- కాంట్రంగి భీమయ్య, ఎల్కపల్లి, బెజ్జూర్*



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు ఏలేశ్వరం వెంకటయ్య. బెజ్జూర్ గ్రామం. తనకున్న ఐదెకరాల్లో ఇప్పటి వరకు మూడు బోర్లు వేశాడు. ఒక్క బోరులో కూడా నీరు పడలేదు. బోర్ల కోసం దాదాపు రూ. 3 లక్షలు ఖర్చుచేశాడు. చివరకు చేసేదేమి లేక వర్షాధార పంటపైనే ఆధారపడుతున్నాడు. సారవంతమైన భూమి, గత ప్రభుత్వం తన పొలంలో నుంచి వేసిన ఉచిత విద్యుత్ లేన ఉన్నా యాసంగి పంట పండించుకోలేని దుస్థితిలో ఉన్నాడు.

# సమష్టిగా సింగరేణి ఉన్నతికి కృషి చేద్దాం

## 37వ సంయుక్త సంప్రదింపుల కమిటీ భేటీలో సీఎండీ ఎన్ బలరామ్


మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

శ్రీరాంపూర్, మార్చి 9 : సమష్టిగా పనిచేసి సింగరేణి ఉన్నతికి మరింత కృషి చేద్దామని సీఎండీ ఎన్ బలరామ్ అన్నారు. ముఖ్యంగా ఉద్యోగుల్లో క్రమ శిక్షణ, సయపాలన పెంచడం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతలు పెరిగే అవకాశముందన్నారు. శనివారం సాయంత్రం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు, అధికారుల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన 37వ జాయింట్ కన్సల్టేటివ్ సమావేశానికి అధ్యక్షత వహిస్తూ కంపెనీ భవిష్యత్తుపై పలు కీలక అంశాలను ప్రకటించారు. ఇప్పటి వరకు తెలంగాణకే పరిమితమై ఉన్న సింగరేణి సంస్థ అనతి కాలంలో జాతీయ స్థాయి కంపెనీగా ఎదగనున్నదని, ముఖ్యంగా విదేశాల్లో కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలోకి అడుగుపెట్టనున్నదని తెలిపారు. దేశీయ అవసరాల రీత్యా 5 వేల మెగావాట్ల సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు పోతుందన్నారు. ఇటీవల రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన నిగం లిమిటెడ్ వారితో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు, 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పాదనకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. సుమారు రూ. 26 వేల కోట్ల దీని కోసం కంపెనీ వెచ్చించనున్నదన్నారు. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి మరో నెల రోజుల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాబోతుందన్నారు. 2025-26లో మూడు కొత్త ప్రాజెక్టులను ప్రారంభించుకోబోతున్నామని వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, కనీస వేతనాల అమలు కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్, నాయకులు నరసింహారెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్, కార్యదర్శి నరసింహులు సమస్యలపై సూచనలు తెలియజేశారు. సంస్థ విస్తరణ, ఉత్పాదకత పెంపుదలవంటి విషయాల్లో తాము పూర్తిగా సహకరిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్‌వీ. సూర్యనారాయణ (ఆపరేషన్స్), వెంకటేశ్వర్లు(పీఅండ్‌పీ), ఈడీ(కోల్ మూమెంట్) ఎస్‌డీ. ఎం.సుభానీ, జీఎం సీపీపీ. మనోహర్, జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్, జీఎం(పర్సనల్) ఐఆర్, పీఎం కవితా నాయుడు, వివిధ కార్పొరేట్ శాఖల జీఎంలు పాల్గొన్నారు.

# ప్రజావాణి యథాతథం

## ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 9 : మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుంచి యథాతథంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఈ నెల 8వ తేదీతో ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

తాండూర్, మార్చి 9 : హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్ రాష్ట్ర కమిటీని గౌరవ అధ్యక్షుడు ఎలగందుల శ్రీనివాస్, పెద్దల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిట్టా హుస్సేన్ (నేరేడుచర్ల బ్రాంచ్), ప్రధాన కార్యదర్శిగా కస్తాల మధు (హుజూర్‌నగర్ బ్రాంచ్), ఉపాధ్యక్షులుగా చింత కింది ఎల్లం (ములుగు జిల్లా), హద్నూరు అంకుష్‌కుమార్ (సంగారెడ్డి జిల్లా), కోశాధికారిగా ఖమ్మంపాటి మధుసూదన్ (పెన్‌పహాడ్ బ్రాంచ్), సహాయ కార్యదర్శులుగా సయ్యద్ సలీం (ఆసిఫాబాద్ జిల్లా), చెరుకుపల్లి స్వామి (తాండూర్ బ్రాంచ్ మంచిర్యాల జిల్లా)తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.